నిఘా నీడలో దేవరకొండ

- పట్టణంలో 92 సీసీ కెమెరాలు ఏర్పాటు
- ప్రతినిత్యం మానిటరింగ్
- కమ్యూనిటీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎస్పీ(ఫైల్)

దేవరకొండ : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. బస్టాండ్, కళాశాలలు, ప్రధాన కూడళ్లు, దుకాణ సముదాయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేర నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు.

పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం

దేవరకొండ పట్టణంతో పాటు పలు చోట్ల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఉర్పాటు చేశారు. గతంలో జరిగిన రోడ్డు విస్తరణ పనులతో కొన్ని మరమ్మతులకు గురికాగా నూతనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు పోలీస్ అధికారులు. ఇదిలా ఉంటే ఇటీవల నూతనంగా సీసీ కెమెరాలను ప్రధాన రహదారితో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసి దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా పట్టణంలోని వాణిజ్య సముదాయాలు, దుకాణదారులకు, ప్రజలకు సీసీ కెమెరాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఇప్పటి వరకు 92 కెమెరాలను ఏర్పాటు చేయగా వీటిలో వీటిలో 80 కేబుల్ కెమెరాలుండగా 12వరకు వైర్‌లెస్ కెమెరాలు ఉన్నాయి. అంతేకాకుండా మరికొన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు. గతంలో పలు కేసుల్లో పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా పురోగతి సాధించిన ఘటనలు ఉన్నాయి. కాగా ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ప్రారంభించారు.

నిరంతర పర్యవేక్షణ



దేవరకొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ సులువు కానుంది. గతంలో ఉన్న కెమెరాలతో పాటు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇటీవల అదనంగా పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. కమ్యూనిటీ కెమెరాల ఏర్పాటుకు సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

వెంకటరెడ్డి, సీఐ, దేవరకొండ

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రైతులను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంట గతంలో కంటే ఎక్కువగా సాగవడంతో ధాన్యం దిగుబడి మరింత అధికంగా వచ్చే అవకావం ఉందన్నారు. మిల్లర్లు రైతులకు ఎలాంటి ఆటంకాలు, కొర్రీలు పెట్టకుండా వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు మిల్లులోకి తరలించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ సైదానాయక్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీని వాస్, కార్యదర్శి వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలి



వీధి విక్రయదారులకు క్యూఆర్ కోడ్‌లను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : వీధి విక్రయదారులు నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లోక కల్యాణ్ మేళాలో భాగంగా డిజిటల్ ఆన్ బోర్డింగ్ క్యాంపు నిర్వహించి క్యూఆర్ కోడ్ కార్డును అందజేసి మాట్లాడారు. క్యూఆర్ కోడ్ (ఫోన్ పే) ద్వారా వీధి విక్రయదారులు నష్టపోకుండా ఉండేందుకు ఈ క్యూఆర్ కోడ్ సౌండ్ వినడం వలన డబ్బులు మీ ఖాతాలో జమ అయిందా కాలేదా అని తెలుస్తుందన్నారు. ఇప్పుడు వారికి ఆదాయం దినాభివృద్ధిగా జరుగుతుందన్నారు. లోక కల్యాణ్ మేళాలో భాగంగా మిగిలిపోయిన వీధి విక్రయదారులకు ఈ నెల 17వ తారీకున పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ ఫోన్ పే నిర్వాహకులు వెంకటేశ్వర్లు, మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ పోతేపాక బక్కయ్య, సీవోలు మామిడాల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఆర్పీలు, వీధి విక్రయదారులు తదితరులున్నారు.

బ్రిడ్జి పునరుద్ధరణకు అంచనాలు రూపొందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



కూలిన లో లెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కూలిపోయిన పేరూర్ బ్రిడ్జి పునరుద్ధరణకు అంచనాలు రూపొందించి పంపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో కలిసి అనుముల మండలం పేరూర్ గ్రామ శివారులో తెగిపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. అక్కడి గ్రామస్తులు, ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి బ్రిడ్జి తెగిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిడ్జి తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రజల రవాణాకు, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే శాశ్వత ప్రాతిపదికన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అనంతరం అనుముల తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి ఆమె ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పేరూర్ బ్రిడ్జి తాత్కాలిక వంతెనకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేందర్, డీఈ సతీష్, ఏఈ సాయిరెడ్డి, కమిషనర్ రామదుర్గారెడ్డి, తహసీల్దార్ రఘు, ఎంపీడీఓ సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతం రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ మహాసభల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజల్ లో నిరవహిస్తున్న మహాసభలకు మున్సిపల్ కార్మికులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి రామ్మూర్తి, సీహెచ్.వెంకన్న, మోహన్, వీరయ్య, లక్ష్మీనారాయణ, బావండ్ల పాండు, పాపిరెడ్డి, బంటు రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ముస్లింలు

మిర్యాలగూడ : ప్రవక్త మహమ్మద్ ముస్తఫా సల్లెల్లాహు అలైహివసల్లంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎస్పీ రాజశేఖర్‌రాజుకు జమైతే ఉలేమియా హింద్ మిర్యాలగూడ నియోజకవర్గ కమిటీ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజాసింగ్ వ్యాఖ్యల వల్ల ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. గతంలో రాజాసింగ్ ఎన్నో సార్లు ఇలాంటి వ్యాఖ్యలు చేసి జైలుకు వెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ మగ్దూమ్, ముఫ్తీ మొహమ్మద్ రియాజ్, మౌలానా మహమ్మద్ జావెద్, నజ్ముద్దిన్, ఇస్హాక్ సలీం, రఫీయుద్దిన్, అశ్రఫ్, ఉబైద్, మోయిజ్, ఇలియాజ్‌ఖాన్, మహమూద్అలీ, అల్తాఫ్ మస్జిద్ కమిటీ బాధ్యులు ఎంఏ.మతిన్, మహబూబ్ అలీబాబా, అహ్మద్‌చావుష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల జాప్యంపై నిరసనలు



మిర్యాలగూడ టౌన్ : జడ్చర్ల-కోదాడ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు



దేవరకొండ : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీసీ యువజన, విద్యార్థి, బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జడ్చర్ల-కోదాడ ప్రధాన జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న వన్ టౌన్, టూ టౌన్ సీఐలు నాగభూషణం, సోమనర్సయ్యల రాస్తారోకో వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏఓ శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డాక్టర్ జాడీ రాజు, బీసీ సంఘాల నాయకులు తిరుమలగిరి అశోక్, ,నాగేశ్వర్‌రావు, మహేష్ గౌడ్, జీడయ్య, వినోద్, గంగాధర్, సురేష్, జయరాజు, చిరంజీవి, సైదులు తదితరులున్నారు.

రిజర్వేషన్ల వ్యతిరేక శక్తుల దిష్టిబొమ్మ దహనం

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల వ్యతిరేకుల దిష్టిబొమ్మను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాజీవ్ చౌక్ వద్ద దహనం చేశారు. ముందుగా పట్టణంలోని దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బంటు వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, భూపతి నరేష్, జానపాటి రవి, సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు, చంద్రయ్య, దోనేటి శేఖర్, దుర్గయ్య, బాలయ్య తదితరురులున్నారు.

దేవరకొండ : స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం దేవరకొండ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్ర హానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ , భాస్కరాచారి, వరికుప్పల శ్రీను, కోటేశ్వరరావు, కృష్ణమాచారి, లక్ష్మణ్, కృష్ణ, వీరయ్య, భిక్షమయ్య, శివగౌడ్, పాల్గొన్నారు.

నిడమనూరు : స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి, రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం సమావేశంలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండలకమిటీ సభ్యుడు నల్లబోతు సోమయ్య, చంద్రశేఖర్, ముత్యాలు, కేశవులు, శివ, పుల్లయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పోషణ మాసం'



వేములపల్లి : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ చంద్రకళ



మిర్యాలగూడ టౌన్ : సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధిక, తదితరులు



చందంపేట : గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మిర్యాలగూడ టౌన్ : పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లి ముర్రుపాలను తాపిస్తే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి మరింత పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, పల్లె దవఖాన ఎంఎల్‌హెచ్ పి.శిరీష అన్నారు. శుక్రవారం ఆలగడప సెక్టార్ పరిధిలోని మిర్యాలగూడ మండలం కొత్తగూడెం అంగన్‌వాడీ కేంద్రం-1లో జరిగిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పూలమ్మ, పద్మ, సోని, హెల్పర్లు యలమంద, ఆశా వర్కర్లు పద్మ, సునితలత పాటు గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

వేములపల్లి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ చంద్రకళ పాల్గొని మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆకుకూరలు తింటే రక్తహీనత బారిన పడకుండా ఉంటారన్నారు. ప్రతిరోజు బాలబాలికలు మిల్లెట్స్, పప్పులు, పాలు, పండ్లు, మునగాకు, గోంగూర, బచ్చలకూర, తోటకూర, క్యారెట్లు, బీట్‌రూట్ వంటి ఆహారాన్ని తీసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుజాత, సీహెచ్‌వో ప్రవీణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని, హెల్త్ సూపర్‌వైజర్ శాంతా, ఏఎస్‌ఎం శైలజ, అంగన్‌వాడీ టీచర్లు శశి కళ, జయమ్మ, ఆశావర్కర్లు, బాలికలు పాల్గొన్నారు.

చందంపేట : మండలంలోని తెల్దేవర్‌పల్లి సెక్టార్ పరిధిలోని హంక్యతండా గ్రామపంచాయతీలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ ప్రసన్న మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, సమతుల ఆహారం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలి



గిరిజన ఆశ్రమ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీటీడీఓ

పెద్దవూర : పాఠశాల దశలోనే విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి(డీటీడీఓ) మూడావత్ చత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రూ.22లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా కల్పించబడుతున్న మౌలిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతోనే సమాజంలో వ్యక్తులకు గౌరవం లభిస్తుందన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాల, హాస్టల్లో సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలను, పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. బాలోజీ, హెచ్‌డబ్ల్యూఓ కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు కృష్ణ, సైదులు, శ్రీను నాయక్, సంధ్య, షాహిన్‌బేగం, శాంతి, శివలీల, ఏఎస్‌ఎం జ్యోతి, హాస్టల్ సిబ్బంది నాగేందర్, సాంబయ్య, లింగయ్య, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు భవనాలు నిర్మించేందుకు స్థానిక సబ్ మార్కెట్ యార్డులోని స్థలాన్ని శుక్రవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సబ్ మార్కెట్ యార్డులోని సర్వే నంబర్ 751,752 లలో నూతనంగా భవనాలు నిర్మించేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రూ. 75లక్షలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి ఈ నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు లేకపోవడంతో స్థానిక అధికారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతిపై సమీక్ష నిర్వహించి పెండింగ్ ఫైళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ అనీల్, ఎంపీడీఓ బిక్షంరాజు, పీఆర్ ఏఈ సైదులు, మార్కెట్ కార్యదర్శి ఖలీల్, శాగం నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

సుపరిపాలనకు ఆర్టీఐఏ దోహదం



దేవరకొండ : అవగాహన సదస్సులో పాల్గొన్న ఆర్డీఓ, తహసీల్దార్లు



మిర్యాలగూడ టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ కలీం



చందంపేట : మాట్లాడుతున్న తహసీల్దార్ రాగ్యానాయక్

మిర్యాలగూడ : ప్రభుత్వ సుపరిపాలనకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐఏ) ఎంతో దోహదం చేస్తుందని ఎంపీడీఓ శేషగిరిశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న పౌరుడికి 30 రోజుల్లో సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

దేవరకొండ : సమాచార హక్కు చట్టం(ఆర్టీఐఏ)పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్టీఐఏ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్టీఐఏ ద్వారా ప్రభుత్వ పారదర్శకత పెరగడంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం(ఆర్టీఐఏ) ఉత్సవాలను తహసీల్దార్ సురేశ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ రజనీకాంత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు వికాస సమితి అధ్యక్షుడు ఎండీ కలీం మాట్లాడారు. ఈ సమావేశంలో ఆర్ఐలు ఠాగూర్ రామకృష్ణ, కృష్ణయ్యలతో పాటు గ్రామ పరిపాలన అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

అడవిదేవులపల్లి : ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరు పారదర్శకతగా ఉండాలని మండల తహసీల్దార్ రాగ్యానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్టీఐఏ యాక్టుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్యాం, స్వామి, నారాయణ పాల్గొన్నారు.

ఏఐ ద్వారా విద్యాబోధన అందించాలి

మిర్యాలగూడ : విద్యార్థులకు ఏఐ, పైథాన్, ఆడినో, యునో కోడింగ్ ఆధారిత విద్యను అందించడం ద్వారా మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చని ఎంఈఓ లావూరి బాలు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోర్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీ, రిసోర్స్‌పర్సన్‌లు మాధవి, ఉమాదేవి, జ్యోతి, సువర్ణ, ఉపాధ్యాయులు కొర్ర కృష్ణకాంత్‌నాయక్, సైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, తావురియా, ఉపేందర్, సునంద, పార్వతి, నాగలత, పద్మ, వెంకట మహేశ్వర్, శేఖర్ రెడ్డి, పుష్ప పాల్గొన్నారు.

వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలోని స్థానిక సాగర్ రోడ్డులోని వాసవి మాత ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ, గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా హరిద్వార్ శాంతికుంజ్ నుంచి వచ్చిన శక్తి కలశానికి భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన గాయత్రి యజ్ఞంలో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలోఅన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కర్నాటి శ్రీనివాస్, తేరటిపల్లి బుచ్చిరాములు, సోమ, జగన్మోహన్, చంద్రమౌళి, దాచేపల్లి వెంకటేశ్వర్లు, చిత్తరంజన్ రెడ్డి, వరలక్ష్మి, అంజిత్, మాధవి పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే భగత్ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా : సాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే భగత్ కుమార్ తన జన్మదిన వేడుకలను శుక్రవారం హాలియా పట్టణంలోని నివాసంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, రవి నాయక్, హాలియా పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కామర్ల జానయ్య, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, అనుముల శ్యాంసుందర్‌రెడ్డి. నల్లగొండ సుధాకర్, బైరం కృష్ణ, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వికలాంగులపై దురుసుగా ప్రవర్తిస్తే శిక్షార్హులు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

మిర్యాలగూడ టౌన్ : వికలాంగులపై దురుసుగా ప్రవర్తిస్తే మానసిక వికలాంగుల చట్టం కింద శిక్షార్హులు అవుతారని మిర్యాలగూడ సీనియర్ సివిల్ జడ్జి సుజయ్ అన్నారు. శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆశాజ్యోతి మానసిక వికలాంగుల ఆశ్రమంలో వికలాంగుల హక్కులు-చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కూడా పిల్లలకు ఎంతో ఓపికతో విద్యను నేర్పించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు దూపాటి మట్టయ్య, మేక కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌నాయక్, భాస్కర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన 13మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి తన కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

మిర్యాలగూడ అర్బన్ : కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ గీతావాణి అన్నారు. గురువారం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో సీహెచ్ఓ, ఎంపీహెచ్ఓ, పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఎస్, ఎంపీహెచ్ఏలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కుష్టువ్యాధి నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో మందులను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎంవో భగవాన్ నాయక్, వైద్య సిబ్బంది శశికళ, సీహెచ్ఓలు మోతీలాల్, వాసుదేవరెడ్డి, ప్రభాకర్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్లపల్లిలో పిచ్చికుక్క స్వైరవిహారం

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని ఉట్లపల్లిలో గురువారం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఉట్లపల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మరో ఇద్దరి పై దాడి చేసింది. అదే విధంగా అదే కసితో గ్రామానికి చెందిన మరో 10 కుక్కలపై దాడి చేయడంతో స్థానికులు ఆ కుక్కను వెంబడించి చంపారు. దీంతో ఆ కుక్క కరిసిన 10 కుక్కలతో ఏమవుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం



సన్మానిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పీఏపల్లి మండలం భీమనపల్లి పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన కె.లక్ష్మీనారాయణను శుక్రవారం చింతలపాలెం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. గతంలో మండలంలోని చింతలపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.శ్రీనివాస్ హెచ్‌ఎం ఆర్‌సీ రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్‌గౌడ్, కేపీ వెంకటేశ్వర్లు, ఎం.కృష్ణ, పల్‌రెడ్డి ఫౌండేషన్ వాలంటీర్ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల సమస్యను పరిష్కరించాలి

పెద్దవూర : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో రెగ్యులర్ వర్కర్ డిప్యుటేషన్ రద్దు చేసి సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించి మాట్లాడారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి కోరే రమేష్, పండు, సాయి పాల్గొన్నారు.